క్లుప్తంగా

కవితా పోటీలకు ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఇటీవల 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో కురుపాం మండలం పి.లేవిడి గ్రామానికి చెందిన పెద్దింటి నిర్మల్‌కుమార్ రాసిన కవిత టాప్–20లో ఎంపికైందని శ్రీశ్రీ కళావేదిక పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పి.దేవానంద్, గౌరవ అధ్యక్షుడు ఆర్.వాసుదేవరావు నాయుడు, ముఖ్య సలహాదారు ఎస్.బాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనతో తెలియజేశారు. ఈ కవితల పోటీలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 500 మంది కవితలు పంపారని, వారిలో మన్యం జిల్లాకు చెందిన నిర్మల్‌కుమార్ రాసిన కవిత ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు.

చురుగ్గా పెట్రోల్ బంక్ నిర్మాణం



పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం చదును చేసిన స్థలం

కురుపాం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.1 కోటి 20 లక్షలతో నిర్మిస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం మండల కేంద్రంలో ఒకటే పెట్రోల్ బంక్ ఉండటంతో వాహణ చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పెంట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తుండడంతో కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన వందలాది మంది వాహన చోదకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ముమ్మరంగా వాహన తనిఖీలు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో బత్తిలి పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఎస్సై యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడేవారిపై అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు. వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అసలైన రైతులకు భూములు చెందాలి



మాట్లాడుతున్న ల్యాండ్ రికార్డ్స్ సర్వే అధికారి సూర్యారావు

సీతానగరం: జగనన్న 'భూ' హక్కు, 'భూ రక్ష రీసర్వే కార్యక్రమంలో భాగంగా గ్రౌండ్ ట్రూత్ సర్వే పనులు వేగవంతం చేయడానికి మండల స్థాయి అధికారులు సమాయత్తం కావాలని ల్యాండ్ రికార్డ్స్ సర్వే అధికారి సూర్యారావు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ అధ్యక్షతన విలేజీ సర్వేయర్లతో గ్రౌండ్ ట్రూత్ సర్వేపై సమీక్షాసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం భూముల 'రీ'సర్వే జరిగిందని తాజాగా జగనన్న ప్రభుత్వం అసలైన రైతులకు భూములు చెందాలనే సంకల్పంతో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రీ సర్వే ప్రక్రియను 2020వ సంవత్సరంలో ప్రారంభించినప్పటికీ కోవిడ్ కారణంగా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని వివరించారు. రైతులు సాగు చేస్తున్న భూములకు సంబంధించిన హక్కులు అదేరైతుల పేరున లేవని తెలియడంతో భూ తగాదాలు పేరుకుపోతున్నట్లు గుర్తించి భూముల స్థిరీకరణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న భూ హక్కు భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పనులు ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో మండల రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

528 మందికి కౌలురైతు గుర్తింపు కార్డులు

ప్రభుత్వ నిబంధనలను అనుసరించి జిరాయితీ భూములున్న రైతులనుంచి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న మండంలోని రైతులు 528 మందికి గుర్తింపు కార్డులు మంజూరు చేశామని తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. ఇంకా ఎవరైనా కౌలు రైతులు మిగిలి దరఖాస్తులు చేసుకుంటే గుర్తించి జగనన్న సురక్ష గ్రామ సభల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా దేశమ్మతల్లి పండుగ

సీతానగరం: మండలంలోని అంటిపేట, వెంకటాపురం గ్రామాల్లో ఆదివారం దేశమ్మతల్లి వారాల పడగను రైతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లో ప్రతిఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభదశలో రైతులు దమ్ము పనులు ప్రారంభించడానికి ముందు దేశమ్మ వారి పండగ నిర్వహిస్తారు. ఈ మేరకు అమ్మవారికి చల్లదనం చేయడానికి, దమ్ముల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా కాపాడాలని కోరుతూ గ్రామ శివారులోని వనం గుడి వరకూ పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి ప్రీతికరమైన పప్పు అన్నం మడపాలు, చీరలు, పసుపు, కుంకుమ, బియ్యం సమర్పించి పూజలు నిర్వహించారు.

కష్టాల కడలిలో ఖరీఫ్

- ఆరంభంలోనే అన్నదాతకు కష్టాలు
- వర్షాలు లేక ఎండిపోతున్న పైరు
- వరుణుడి కరుణ కోసం ఆశగా ఎదురు చూస్తున్న రైతన్న



గరుగుబిల్లి: నీరు లేకపోవడంతో పెద్దూరులో ముదిరిపోతున్న వరినారు

గరుగుబిల్లి: కాయకష్టంతో మట్టిని నమ్ముకుని ఆహార ధాన్యాలు ఉత్పత్తిచేసే అన్నదాతకు ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా సకాలంలో విత్తనాలు పంపిణీ చేసినా.. సకాలంలో వర్షాలు లేకపోవడంతో నీటితడులు లేక నారుమడులు ఎండిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా విత్తనాల మొలకలు రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గరుగుబిల్లి మండలంలో 5,540 హెక్టార్లలో ఖరీఫ్ వరిపంట సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందులో తోటపల్లి ప్రాజెక్టు కాలువల దిగువన 2,400 హెక్టార్లు, మిగిలినది చెరువుల కింద, వర్షాధారంగా సాగుచేస్తున్నారు. ఉభాలు జరగాల్సి ఉన్నప్పటికీ సాగునీరు అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికీ నాట్లు ప్రారంభం కాలేదని రైతులు అంటున్నారు. వరుణుడి రాక కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నారులో సస్యరక్షణ

భామిని: వర్షాలు లేకపోవడంతో వరినాట్లు ఆలస్యమయ్యాయి. ఈ నేపథ్యంలో నారు మడులకు చీడపీడలు, తెగుళ్ల ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నీటితడి అందకపోవడంతో నారు ఎండిపోయి బలహీనంగా తయారవుతుంది. జింక్, సూక్ష్మమూలకాల లోపం కారణంగా తెల్లబారిపోయి, పిలకలు వేసే సామర్థ్యం తగ్గిపోతుంది. పైరు ఎండిపోకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి సూచించారు. పైరు ఎర్రబారిపోయినట్లయితే యూరియా 3గ్రాములు, పొటాష్ 2 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా నీటి కొరత తీర్చుకొని వరినారు తేరుకుంటుంది. కాండం తొలుచు పురుగు నివారణకు ఫ్లోరైడ్ గుళికలు లేదా కార్బోఫిరాన్ గుళికలను చల్లుకోవాలి. ఒక సెంటు విస్తీర్ణంలోని నారుమడికి 160 గ్రాముల కార్బోఫిరాన్ గుళికలు లేదా 200గ్రాముల ఫ్లోరైడ్ గుళికలు వేసుకోవాలి. నాట్లు వేసేందుకు వారం ముందు జల్లుకున్నట్లయితే మొక్కదశలో పైరుకు రక్షణగా ఉంటుంది. సూక్ష్మపోషకాలు లోపించినట్లు గుర్తిస్తే నారుకు 19–19–19 గానీ, 13–0–45 ఎరువు మైక్రో న్యూట్రీమిక్సర్ వేసుకోవాలి. ఒక లీటర్ నీటికి 3 గ్రాముల మైక్రో మిక్సర్ కలిపి పిచికారి చేయాలి. నారు తెల్లబారినట్లయితే జింక్ లోపం ఉన్నట్లు గుర్తించి జింక్ సల్ఫేట్ అరకిలో చొప్పున జల్లుకోవాల్సి ఉంటుంది.



భామిని: బత్తిలిలో పోషకాలు అందక తెల్లబారిన వరినారు

పట్టణ అభివృద్ధే లక్ష్యం



రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: గత టీడీపీ ప్రభుత్వంలో ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల వీరఘట్టం పట్టణ అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. రూ.5.50 కోట్లతో చేపడుతున్న వీరఘట్టం రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణ అంశం ఎంతో సున్నితమైందని, రోడ్డు విస్తరణ జరిగితే ఇక్కడి వ్యాపారులు టీడీపీకీ ఓట్లు వేయరనే నెపంతో పనులు జరగకుండా గతంలో టీడీపీ నాయకులు అడ్డుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏనాడూ ఓట్లు గురించి పాకులాడలేదని, వీరఘట్టం పట్టణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ పనులకు సహకరించిన వర్తకులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు విక్రాంత్ కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టాలని కాంట్రాక్టర్లు చంద్రశేఖర్, అనీల్‌కుమార్‌కు సూచించారు.

21న చిదిమి–పాలమెట్ట రోడ్డుకు శంకుస్థాపన

టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపాను దాటికి ధ్వంసమైన చిదిమి–పాలమెట్ట రహదారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగిందని ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. తనతో పాటు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కృషి ఫలితంగా ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నెల 21న చిదిమి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు తదితరులున్నారు.

19న మొండెంఖల్‌లో 'గడపగడప మన ప్రభుత్వం'

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో ఈ నెల 19న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు పంచాయతీ పరిధిలోని గోర్జుపాడు, జీలుగుమానుగూడ, మర్రిమానుగూడ గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందని, మధ్యాహ్నం నుంచి మొండెంఖల్ పంచాయతీ కేంద్రంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ రూరల్: స్థానిక జగనన్న కాలనీలో నూతన సబ్‌స్టేషన్ పనులు నిర్వహిస్తునందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లకు సంబంధించి టౌన్–1 ఫీడర్‌లో యాలం కూడలి, నవోదయనగర్, ఎన్‌కే రాజపురం, సీతంపేట రోడ్డులో ఉదయం 9 గంటల నుంచి మధ్యహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

సాగునీటి కాలువల పరిశీలన



మల్లివీడు వద్ద తోటపల్లి సాగునీటి కాలువను పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: ఈ నెల 20 నుంచి తోటపల్లి కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో మండలంలోని సాగునీటి కాలువలను వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్ తదితరులు ఆదివారం పరిశీలించారు. మల్లివీడు మీదుగా అరదలి, భాసూరు గ్రామాలను కలుపుతూ వెళ్లే తోటపల్లి కాలువలను పరిశీలించారు. మండల రైతులకు ప్రధాన సాగునీటి వనరైన తోటపల్లి కాలువలపై దృష్టి పెట్టామన్నారు. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో, స్థానికంగా అధిక వర్షాలు కురిస్తే ఏర్పడే సమస్యలను అధికారులు ముందస్తుగా గుర్తించి గండ్లు పడకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో కాలువలకు పడిన గండ్లు, తీసుకున్న చర్యలు, ప్రస్తుతం జరుగుతున్న పనులపై స్థానిక రైతులు, లష్కర్లతో చర్చించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల సూచనలతో ఖరీఫ్ పూర్తయ్యే వరకు వ్యవసాయ సలహామండలి సభ్యులు, రైతులు, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వారి వెంట బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్, మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు టి.ఉపేంద్రకుమార్, ఇరిగేషన్ ఏఈ శంకరరావు తదితరులున్నారు.

మిల్లుకు సిద్ధంగా పామాయిల్ గెలలు



తూనిక కేంద్రంలోఉన్న పాయిల్ గెలలు, పక్కనే ట్రాక్టర్‌తో గెలలు

సీతానగరం: మండలంలోని కాశీపేట నుంచి రాజాంలో ఉన్న శ్రీనివాసా పామాయిల్ మిల్లు కు తరలించడానికి పామాయిల్ గెలలు సిద్ధంగా ఉన్నాయి. చెరకు పంటకు ప్రత్యామ్నాయంగా మండలంలోని రైతులు నీటి వనరులు సమకూర్చుకుని పామాయిల్ సాగు చేస్తున్నారు. ఆదివారం మండలంలోని పామాయిల్ గెలలను తూనిక కేంద్రానికి ట్రాక్టర్‌తో తెచ్చిన రైతులనుద్దేశించి మండల ఉద్యాన శాఖ అధికారిణి ప్రత్యూష మాట్లాడుతూ పామాయిల్ తోటల పెంపకానికి వాతావరణం అనుకూలించడంతో పాటు మండలంలోనే శ్రీనివాసా పామాయిల్ మిల్లు యాజమాన్యం నర్సరీని నెలకొల్పడంతో 2,130 ఎకరాల్లో పామాయిల్ తోటల సాగు జరిగిందన్నారు. నాలుగేళ్ల క్రితం వేసిన తోటలకు వాతావరణం అనుకూలించడంతో నేడు అన్‌సీజన్ అయినప్పటికీ గెలల దిగుబడి పెరిగిందన్నారు. మొక్కనాటిన మూడేళ్ల తోట కాపు వస్తుందన్నారు. తోట సంరక్షణపై రైతులకు వివరిస్తున్నామని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపారావు

పార్వతీపురంటౌన్: పట్టణం, గ్రామాల్లో ప్రయాణికులకు సేవలందించే ఆటో డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలని పార్వతీపురం ట్రాఫిక్ ఎస్సై పాపారావు సూచించారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఆదివారం ఆటో డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా, వారితో అమర్యాదగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓవర్‌లోడ్ ఎక్కించరాదని ధనాపేక్షతో కాకుండా, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని హితవు పలికారు. వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, లేకుంటే చట్టపరంగా అపరాధ రుసుం విధిస్తామని ట్రాఫిక్ ఎస్సై స్పష్టం చేశారు. వివిధ మార్గాల్లో సంచరించే ఆటోల వివరాలను ఆయా స్టాండ్‌ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు పేర్కొన్నారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లతే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. పలుమార్లు పట్టుబడితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

దమ్ము పనుల్లో రైతులు నిమగ్నం



సీతానగరం: వర్షాలు కురవడం, మండలంలో నీటివనరులున్న కారణంగా రైతులు ఖరీఫ్ వరిసాగులో ఉబాల పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో 14 వేల ఎకరాల భూముల్లో ఖరీఫ్ వరి సాగు చేయడానికి నిర్ధారించి రైతులకు అవసరమైన విత్తనాలు పంపిణీ చేశామని, వారికి అవసరమైన ఎరువులు 21 రైతు భరోసా కేంద్రాలలో భద్రపరిచినట్లు ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు.

మూడురకాలుగా ఉబాలు

ఖరీఫ్ సీజన్‌లో అనుకూలంగా వర్షాలు కురవడంతో మూడు రకాలుగా రైతులు ఉబాలు చేస్తున్నారు. మళ్లలో నారు సాధారణ పద్ధతిలో మహిళలతో నాట్లు వేయించడం, డ్రమ్ సీడర్ విధానం, తాడుఉడుపు, యంత్రపరికరాలతో నాట్లు వేసే పద్ధతి అవలంబిస్తున్నారని ఏఓ అవినాష్ వివరించారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు



లుంబూరు రైతుభరోసా కేంద్రానికి చేరిన ఎరువులు

పాలకొండ రూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాలతకు అవసరమైన ఎరువులు(యూరియా, డీఏపీ, పొటాష్) ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు(ఏడీ) కె.రత్నకుమారి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఎరువులను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాల వద్దకు ఆధార్ కార్డుతో వస్తే వివరాలు నమోదు చేసుకుని ఎరువులను అందజేయడం జరుగుతుందన్నారు. పాలకొండ మండంలో 384.5 మెట్రిక్ టన్నుల యూరియా, 200 మెట్రిక్ టన్నుల డీఏపీ, సీతంపేట మండలంలో యూరియా 80, డీఏపీ 80 మెట్రిక్ టన్నులు, వీరఘట్టం మండలంలో 202.5 మెట్రిక్ టన్నుల యూరియా, 140 మెట్రిక్ టన్నుల డీఏపీ, భామినిలో యూరియా 282.5, డీఏపీ 150 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వాటితో పాటు రైతుల అవసరాల మేరకు పొటాష్, తదితర ఎరువులు కూడా సిద్ధం చేసినట్ల చెప్పారు.

మీనామృతంతో సస్యరక్షణ



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న పోలినాయుడు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి నారుమడుల సస్యరక్షణకు మీనామృతం ఎంతో దోహదం చేస్తుందని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జ్ వి.పోలినాయుడు అన్నారు. మండలంలోని రావివలస, శివ్వాం గ్రామల్లో మీనామృతం తయారీపై ఆదివారం రైతులకు అవగాహన కల్పించారు. మూడు కిలోల చేపల వ్యర్థాలు, మూడు కిలోల బెల్లం మిశ్రమంను 20 నుంచి 25 రోజులు మురగబెట్టాలి. తరువాత ఒక ట్యాంకు నీటిలో 200 ఎంఎల్ మీనామృతం కలిపి నారుమడిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ ద్రావణాన్ని కాయగూరలు, పండ్ల తోటలలో పిచికారీ చేయడంవల్ల నత్రజని స్థిరీకరించబడుతుందన్నారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, ఈశ్వరరావు, అప్పలనాయుడు, త్రినాథ తదితరులున్నారు.

ఘనజీవామృతం పంటకు మేలు



రైతులతో ఘనజీవామృతాన్ని తయారు చేయిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: రసాయన ఎరువైన డీఏపీకి బదులుగా సహజ సిద్ధంగా తయారు చేసుకునే ఘన జీవామృతం పంటకు మేలని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు అన్నారు. చెముడుగూడ పంచాయతీ పుట్టగూడ గ్రామంలోని ఘనజీవామృతం తయారీపై గిరిజన రైతులకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన జీవామృతంను పంటపొలంలో వేయడం వలన భూసారం పెరుగుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందుతాయని, పురుగులు, తెగుళ్లు ఆశించవని అన్నారు. ఫలితంగా పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కద్రక దీప, నిమ్మ పద్మ, కొండగొర్రి పద్మజ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయుడు

పాలకొండ: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వీ నాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. నగరపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను రెగ్యూలర్ చేయాలని, సమాన పనికి సమాన వేతం అందించాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 20, 21న రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో పడాల భాస్కరరావు, చింతల సంజీవి, సురేష్, పడాల వేణు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం



రావివలసలో నిర్మించిన సీసీ కాలువ

గరుగుబిల్లి: మండలంలో రావివలస గ్రామంలోని సంతోషనగర్‌లో సీసీ కాలువల నిర్మాణ చురుకుగా జరుగుతున్నాయి. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు మురుగు సమస్యను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే స్పందించి గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కేటాయించిన నిధుల నుంచి రూ.3 లక్షలను సీసీ కాలువల నిర్మాణానికి మంజూరు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, సర్పంచ్ బి.అప్పలడు పర్యవేక్షణలో ప్రస్తతం కాలువల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాలువల నిర్మాణంతో మురుగు సమస్య తీరనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వహణకు నోచుకోని ఆర్టీసీ కాంప్లెక్స్



కనీస నిర్వహణకు నోచుకోని గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ గత కొన్ని రోజులుగా కనీస నిర్వహణకు నోచుకోకపోవడంతో చట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాంప్లెక్స్ ఆవరణంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. పశువులు సంచరిస్తూ మల,మూత్రాలు విసర్జిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ స్థలంలో ఉన్న దుకాణాల నుంచి నెలనెలా వేల రూపాయల అద్దెలు తీసుకుంటున్నా.. కాంప్లెక్స్ నిర్వహణను గాలికొదిలేయడంపై అధికారుల తీరుపై పలువురు ప్రయాణికులు, వ్యాపారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంప్లెక్స్‌లో నిర్వహణపై దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.